క్లుప్తంగా

‘ట్రినిటి’లో ‘వెలోరా 2కే25’



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ‘వెలోరా 2కే25’ పేరిట వార్షిక వేడుకలు నిర్వహించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పోటీ ప్రపంచంలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ఉద్యోగాలు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏఓ సురేశ్, రాజిరెడ్డి, వంశీ, నటరాజ్, ప్రభాకర్, స్వాతి, పద్మిని, ఆరిఫ్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న ఏసీపీ రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులను గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ గురువారం అభినందించారు. 500కుపైగా మార్కులు సాధించిన 12మంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలుయాదవ్, హెచ్‌ఎం రవీందర్‌రావు ఉన్నారు.

ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణంలో స్వాముల బృందం

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములు గురువారం ఆలయ ప్రాంగణంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలకు సన్మానం

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1.16లక్షల విరాళాన్ని ఆలయ నిర్మాణ కర్త సాయిరి మహేందర్‌కు అందజేశారు. ఆలయ నిర్మాణ ఆవరణలో అకౌంటెంట్ కట్ల సంపత్ దంపతులు గురువారం అందజేయగా వారిని సన్మానం చేశారు. స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి రూ.11,116 విరాళం అందజేశారు. మాజీ సర్పంచ్ సాయిరి పద్మ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, వెంకన్న, పూసాల రామకృష్ణ, జంజిరాల లక్ష్మణ్, గుండ మురళి, గోపాల్ ఉన్నారు.

నిరుద్యోగులకు అందని ద్రాక్షగా రాజీవ్ యువ వికాసం

రామగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగులకు అందని ద్రాక్షగా మారిందని బీఎస్పీ మంథని ఇన్‌చార్జి జనగామ రవికుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కల్పన కోసం కేటాయించిన ఈ పథకానికి సిబిల్ స్కోర్ ప్రామాణికం చేయడం సరికాదన్నారు. సిబిల్ స్కోర్ తప్పనిసరి చేయడం విరమించుకోవాలని, లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు ఇరుగురాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఈదురుగాలుల వర్షం

సుల్తానాబాద్: మండల కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. గురువారం పలు ప్రాంతాల్లో వర్షం ప్రారంభం కాగానే రైతులు అప్రమత్తమై వారివారి వద్ద కుప్పలపై టార్పాలిన్ కప్పారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను రైతులు వేడుకుంటున్నారు. కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.





సీహెచ్‌పీలో లేస్తున్న బొగ్గు దుమ్ము

బొగ్గు దుమ్ము ఇలా.. పనిచేసేదెలా?

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సీహెచ్‌పీలో విపరీతమైన బొగ్గు దుమ్ములేస్తోంది. నిత్యం వందల సంఖ్యలో ఉద్యోగులు సీహెచ్‌పీ పరిసరాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కాలుతున్న బొగ్గును నేరుగా తీసుకొచ్చి డంపర్ నుంచి సీహెచ్‌పీ బంకర్‌లో డంప్ చేయడంతో సమస్య తలెత్తుతోంది. కాలుతున్న బొగ్గును చల్లార్చడంతో పాటు దుమ్ము లేవకుండా సకాలంలో సరైన వాటర్ స్ప్రే చేయకపోవడంతో బొగ్గు దుమ్ము విపరీతంగా లేస్తోంది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. సీహెచ్‌పీ కింది నుంచే గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీ ప్రధాన రోడ్డు ఉంది. అయితే బొగ్గు దుమ్ము లేస్తుండటంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సమీపంలోని వీర్లపల్లి గ్రామస్తులు శ్వాసకోస సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయంలో యాజమాన్యం వెంటనే స్పందించి బొగ్గు దుమ్ము అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో పెరుగుతున్న చేరికలు





ప్రభుత్వ కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరుతున్న లెక్చరర్లు

- విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తున్న లెక్చరర్లు

సుల్తానాబాద్: పదో తరగతి పరీక్ష ఫలితాలు ప్రకటించిన వెంటనే జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. ప్రభుత్వ కళాశాలల్లోని సౌకర్యాలు, విద్యా బోధన తీరు, ఈ ఏడాది, గత సంవత్సరాల్లో వచ్చిన ఫలితాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు లెక్చరర్లు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

ఉచిత పుస్తకాలు.. ప్రత్యేక విద్యాబోధన

జూనియర్ కళాశాలలో పేద, మధ్యతరగతి విద్యార్థులే కళాశాలలో విద్యనభ్యసిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. వాటితో పాటు పలువురు దాతల నుంచి నోట్ బుక్స్ సైతం ఇప్పిస్తున్నారు. విద్యా బోధనతో పాటు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలపై నమ్మకం కలిగేలా చేస్తున్నారు.

ప్రవేశాల సంఖ్య పెంచుతాం



పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల వద్దకు లెక్చరర్లు వెళుతున్నారు. కళాశాలలో చేర్పించడానికి లెక్చరర్లు విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నారు. నాణ్యమైన విద్య బోధించడంతోపాటు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు రానున్న ఏడాది విద్యా సంవత్సరంలో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం తీసుకురానున్నట్లు తెలిసింది. 2025–26లో ప్రవేశాల సంఖ్య పెంచుతాం.

– కల్పన, ఇంటర్మీడియట్ బోర్డు నోడల్ ఆఫీసర్, పెద్దపల్లి

నృసింహస్వామి ఆలయంలో కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి స్వామివారి తిరుక్కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం రక్షాబంధనం, అంకురార్పణం, అఖండదీపారాధనం, ధ్వజారోహణం కార్యక్రమాలు జరిగాయి. రాత్రి 8 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

‘సాక్షి’పై దాడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే

గోదావరిఖని: ప్రజా గొంతుకగా నిలిచిన ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్ ఇంటిపై ఏపీ పోలీసులు అక్రమంగా దాడులు చేసి, భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి అన్నారు. గురువారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రజా పోరాటాలను వార్తలుగా ప్రచురించడం ప్రభుత్వానికి నేరంగా కనిపిస్తోందన్నారు. పాత్రికేయులు, పత్రికలను బెదిరించి లొంగదీసుకోవడం అసాధ్యమని పాలకులు గుర్తుంచుకోవాలన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజులు తలపించేలా ఏపీ ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని ఆయన అన్నారు. పత్రికా స్వేచ్ఛను గౌరవించి, పత్రికలో లేవనెత్తిన అంశాల పరిష్కారానికి కృషి చేసి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.



నిర్లక్ష్యానికి నిదర్శనం

రామగుండం: అమృత్ భారత్‌లో భాగంగా రామగుండం రైల్వేస్టేషన్‌లో రూ.కోట్లాది నిధులతో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల్లో అడుగడుగునా వైఫల్యాలు కన్పిస్తున్నాయి. రైల్వే కాలనీలో నూతనంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టగా ఓ వృక్షం అడ్డుగా ఉన్నా దానికి ప్రత్యామ్నాయంగా సంబంధిత కాంట్రాక్టరు నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా ఆ వృక్షం ఉన్న చోట డ్రైనేజీ నిర్మాణం వదిలేసి ఇరువైపులా నిర్మాణం చేపట్టారు. అయితే రాబోయే వర్షాకాలంలో వరద నీరు భారీగా నిలిచే అవకాశాలు ఉన్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు క్షేత్ర పరిశీలన చేసి డ్రైనేజీ నిర్మాణం సంపూర్ణంగా చేపట్టాలని, అదే ప్రదేశంలో ఉన్న భారీ కేబుల్స్‌కు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉచిత క్రికెట్ కోచింగ్ ప్రారంభం



క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌ను ప్రారంభిస్తున్న డీవైజీఎం(పర్సనల్) కిరణ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ కోచింగ్‌లో భాగంగా గురువారం స్థానిక జీఎంకాలనీ గ్రౌండ్‌లో సింగరేణి డీవై జీఎం(పర్సనల్) కిరణ్‌కుమార్ క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపు జూన్ 6వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి డి.కిరణ్‌కుమార్‌యాదవ్, కోచ్‌లు ఎం.సుదేష్‌కుమార్, ఎం.శేఖర్, సీనియర్ క్రీడాకారులు ఎం.రవిగౌడ్, ఆర్.శ్రీనాథ్, ఎ.రాజ్‌కుమార్, అంజి, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

మోకుదెబ్బ గౌడ సంఘం ఆవిర్భావ దినోత్సవం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో గురువారం సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవం ఆ సంఘం నాయకులు జరుపుకున్నారు. గీత కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఆవిర్భవించిన సంఘం గౌడన్నల సమస్యల సాధనకోసం పోరాడుతుందని జిల్లా అధ్యక్షుడు శంకర్ అన్నారు. నాయకులు బుచ్చయ్య, బాలసాని ఈశ్వర్, వెంకటేశ్, పర్శరాములు, కొమురయ్య పాల్గొన్నారు.

నేడు భారత జవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

మంథని: భారత సైన్యానికి మద్దతుగా శుక్రవారం మంథనిలోని గాంధీచౌక్ నుంచి పూలే విగ్రహం, శ్రీపాద చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక వాణిజ్య వ్యాపార సంస్థలు సాయంత్రం వేళ తమ దుకాణాలు బంద్ చేసి సంఘీభావ ర్యాలీలో పాలుపంచుకోవాలని కోరారు. మంథని పుర ప్రముఖులు, అన్నివర్గాల ప్రజలు, కుల సంఘాలు, వర్తక, వాణిజ్య వ్యాపార సంస్థలు సంఘీభావ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా తిరుక్కల్యాణోత్సవం



ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భాగవతచరణురేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో మార్నింగ్ వాకర్స్



రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగిస్తున్న వాకర్స్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటకు చెందిన మార్నింగ్ వాకర్స్ బృందం ఇటీవల గ్రామంలో పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారిపై ఇటీవల వీచిన ఈదురుగాలులతో భారీ వృక్షం కుప్పకూలి రోడ్డుకు అడ్డుగా పడింది. ఫలితంగా అటువైపు వెళ్లే ఉపాధి కూలీలు, వ్యవసాయదారులు, ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. వాకర్స్ బృందం సభ్యులు రోడ్డుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాన్ని తొలగించి ప్రజల సమస్యను పరిష్కరించారు.



సుల్తానాబాద్‌రూరల్: అభివృద్ధి కోసం వేసిన డబుల్‌రోడ్డు నిర్మాణం రెండేళ్లు దాటినా సెంట్రల్ లైటింగ్ లేక చిమ్మచీకట్లో గర్రెపల్లి ప్రధాన రోడ్డులో నడవాలంటే మహిళలు, యువతులు జంకుతున్నారు. మండలంలోని గర్రెపల్లి గ్రామ ప్రధాన రోడ్డులో రెండేళ్ల క్రితం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2కోట్లతో డబుల్‌రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌తో నిర్మాణ పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ డబుల్ రోడ్డు నిర్మాణం వరకే చేపట్టగా సెంట్రల్ లైటింగ్ పనులు ఇప్పటి వరకు చేపట్టలేదు. దీంతో ప్రధాన రోడ్డు పూర్తిగా చిమ్మ చీకటిగా మారింది. ఈ రోడ్డుపై రాత్రి 8గంటలకు మహిళలు వెళ్లాలంటే భయందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కంటిన్యూస్ మైనర్ ఆపరేటర్లకు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లిగనిలో కంటిన్యూస్ మైనర్ యంత్రాలకు అర్హత కలిగిన సీగ్రేడ్ ఆపరేటర్ల ఎంపిక కోసం గురువారం ఇంటర్వ్యూ నిర్వహించారు. గని ఏజెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించగా.. అర్హత గల ఇద్దరు ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గని ఏజెంట్ నెహ్రూ, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మేనేజర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ పరిరక్షణకు సమ్మెను సక్సెస్ చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

గోదావరిఖని: సంస్థ పరిరక్షణ కోసం సమ్మె సక్సెస్ చేయాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్త గనులు, సంస్థ పరిరక్షణ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈనెల 20న జరిగే ఒకరోజు టోకెన్ సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, అలవెన్సులపై ఆదాయ పన్ను యాజమాన్యమే చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, కార్మిక ప్రమాద బీమా, సీఎంపీఎఫ్ అమలు చేయాలన్న డిమాండ్లతో జేఏసీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కొరిమి రాజ్‌కుమార్, దేవులపల్లి రాజేందర్, తుమ్మల రాజారెడ్డి, మాదాసు రామ్మూర్తి, ఎల్.ప్రకాశ్, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, జీగురు రవీందర్, ఎంఏ గౌస్, అన్నారావు, సయ్యద్ సోహేల్, మెండె శ్రీనివాస్, నరహరి, సారయ్య, వడ్డెపెల్లి శంకర్, పి.శ్రీనివాస్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని విప్లవ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లిగనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ.కృష్ణ, టీఎస్‌యూఎస్ అధ్యక్షుడు కుమారస్వామి, ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు రాములు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏడుకొండలు పాల్గొన్నారు. 20న జరిగిన సమ్మెలో పాల్గొనేందుకు మిగతా కార్మిక సంఘాలు కలిసి రావాలని కోరారు.

మంత్రి ‘పొన్నం’ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గీత కార్మికులు

సుల్తానాబాద్: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గీత కార్మికులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గడ్డం సత్యనారాయణగౌడ్, మంద శ్రీనివాస్‌గౌడ్, పొన్నం తిరుపతిగౌడ్, కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అంజయ్యగౌడ్, అంతటి లచ్చయ్యగౌడ్, అంతటి సాగర్‌గౌడ్, పోడేటి వెంకటేశ్‌గౌడ్, కొయ్యడ ఎల్లయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పొన్నం మధుకర్‌గౌడ్, అంతటి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు యువత ముందుండాలి



రక్తదాన శిబిరంలో సొసైటీ సభ్యులు

పెద్దపల్లిరూరల్: రక్తదానం చేయడం.. ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయడమేనని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ అన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ దినోత్సవం, తలసేమియా దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యావంతులైన యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీకాంత్, సతీశ్‌రెడ్డి, రాజేందర్, అనిల్‌కుమార్, డీవీఎస్ మూర్తి, సురేశ్, రాము పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899